క్లుప్తంగా

పెడన పోలీస్ స్టేషన్‌లో పలువురిపై వేటు..?

పెడన: వైఎస్సార్ సీపీ నాయకులను, సానుభూతి పరులను అరెస్ట్ చేయడంలోనూ, వారికి బెయిల్ రానీయకుండా కట్టుదిట్టంగా చేపట్టాల్సిన చర్యలు తీసుకునే విషయంలోనూ ఎన్డీయే కూటమి నాయకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. స్టేషన్ నుంచి సమాచారం లీక్ చేశారని, అందువల్ల వారికి బెయిల్ మంజూరైందనే సాకుతో పలువురు సిబ్బందిని వీఆర్‌కు పంపించినట్లుగా తెలుస్తోంది. ఒక హెడ్ కానిస్టేబుల్, మరొక కానిస్టేబుల్‌ను ఈ విషయంలో బలిపశువులను చేశారనే వాదన వినపడుతోంది. మచిలీపట్నం డీఎస్పీతో పాటు మచిలీపట్నం ఆర్.పేట సీఐ, పెడన సీఐలు, పలువురు ఎస్‌ఐలు విచారణలో పాల్గొన్నారు. మరికొందరిపై బదిలీ వేటు పడే అవకాశాలు ఉన్నాయనే వాదనలు వ్యక్తమవుతుండటం గమనార్హం. ఏది ఏమైనా వైద్యులు ఇచ్చిన నివేదిక ప్రకారం తయారు చేసిన రిపోర్టు ఆధారంగా బెయిల్ మంజూరైనా అది పోలీసులదే తప్పుగా ఎన్డీయే కూటమి నాయకులు పేర్కొంటూ వారిని వీఆర్‌కు పంపించడం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నాగాయలంక: కృష్ణాజిల్లా వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంఘం ద్వారా నాగాయలంక మండలంలో వివిధ కులాల ప్రాతిపదికన మహిళలకు ఆర్థిక సహాయం, కుట్టుమిషన్ శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక ఎంపీడీఓ సుధాప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో బీసీలు 40 మందికి, కమ్మ-28, కాపు-10, రెడ్డి-8, క్షత్రియ-1, ఆర్యవైశ్య-8, బ్రాహ్మణ-6 మంది లబ్ధి పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఇందుకోసం అర్హులైన లబ్ధిదారులు ఈనెల 22వ తేదీలోగా సచివాలయం లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎపిబిఎంఎంఎస్.ఎపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో 18-50 సంవత్సరాల వయస్సు, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు ఆధారాలతో నమోదు చేసుకోవచ్చునని ఈ అవకాశాన్ని సంబంధిత లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిలకలపూడిలో ఆక్రమణల తొలగింపు



మచిలీపట్నంటౌన్: నగరంలో కొద్ది వారాలుగా జరుగుతున్న ఆక్రమణల తొలగింపు కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. నగరంలోని చిలకలపూడి సెంటర్ ప్రాంతంలో రోడ్డు మార్జిన్, డ్రెయిన్‌లపై ఏర్పాటు చేసిన ఆక్రమణలను తొలగించారు. పోలీసు పహారా నడుమ జేసీబీ, క్రేన్‌లతో ఆక్రమణలోని బడ్డీలను తొలగించి, కట్టడాలను ధ్వంసం చేశారు. కమిషనర్ బాపిరాజు, టీపీఓ శ్రీహరిప్రసాద్ పర్యవేక్షించారు.

ఆశీల పాటలకు 22న బహిరంగ వేలం

నాగాయలంక: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో 2025-26వ సంవత్సరానికి వారపు సంత(ఆదివారం), రోజువారీ ఆశీలు వసూలునకు ఈ నెల 22వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి జరుగు పవన్ కుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 17న వేలం జరుపగా పాటదారులు ఎవరూ రానందున 19వ తేదీకి వాయిదా వేశామని, బుధవారం కూడా ఎవరూ ఆశీల పాటకు ముందుకు రాలేదన్నారు. దీంతో ఆఖరి వాయిదా ఈనెల 22న ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరుపుతామని, పాటలో పాల్గొనదలచిన వారు సంబంధిత వివరాలను కార్యాలయంలో తెలుసుకోవాలని కార్యదర్శి పవన్‌కుమార్ చెప్పారు.

లంకలకలువగుంట ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

పెడన: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు సంబంధించి అవకతవకలకు పాల్పడినట్లు రుజువు కావడంతో 15 రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని పేర్కొంటూ పెడన మండలం లంకలకలువగుంట ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.కిరణ్‌బాబును విధుల నుంచి సస్పెండ్ చేశారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వు కాపీలను సస్పెండ్ అయిన ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు ఎంపీడీవో పెడన, గుడివాడ క్లస్టర్ సహాయక పథక సంచాలకుల వారికి పంపించినట్లు ఆ ఉత్తర్వుల కాపీలో పేర్కొన్నారు.

ప్రచారార్భాటం...చర్యలు శూన్యం

- స్వచ్ఛ ఆంధ్ర...స్వచ్ఛ దివస్ అంటూ హడావుడి
- ఏ దుకాణంలో చూసినా నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ సంచులు
- పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- మార్పొచ్చేనా....ప్లాస్టిక్ పోయేనా..!



ప్లాస్టిక్ సంచుల ద్వారా పండ్లు, కూరగాయలు తీసుకువెళ్తున్న వ్యక్తి



ప్రధాన డ్రయిన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

పెడన: నిత్యావసర సరుకుల కోసం బయటకు వెళ్లినా...కూరగాయలు, చికెన్ లేదా మటన్, చేపలు తీసుకురావడానికి ఇలా...దేనికైనా సరే నేడు దాదాపుగా అందరూ ప్లాస్టిక్ కవర్లనే వాడుతున్నారు. ఇంటి నుంచి చేతి సంచి తీసుకువెళ్లి తెచ్చుకుందామనే అవగాహన, ప్లాస్టిక్‌ను దూరం పెడదామనే ఆలోచన ఎవరికీ లేదు. ఏ దుకాణానికి వెళ్లినా ఒకటి రెండు సరుకులు కొనుగోలు చేసి కవరు ఇవ్వండని అడుగుతున్నారు. కవర్ ఇవ్వకపోతే సదరు దుకాణదారుడిని ఆ మాత్రం కవర్ కూడా ఇవ్వలేరా అంటూ ప్రశ్నిస్తున్నారు. దీంతో సదరు దుకాణదారుడు ప్లాస్టిక్ సంచులు ఇస్తున్నారు. వీటిని ఉపయోగించి ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండటంతో అవి డ్రయిన్లకు అడ్డం పడి మురుగునీరు ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి.

120 మైక్రాన్‌ల కంటే మందం అధికంగా ఉంటేనే విక్రయించాలి

నిబంధనల మేరకు 120 మైక్రాన్‌ల మందం కంటే అధికంగా ఉన్న వాటినే విక్రయించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వినియోగించకూడదని మొరపెట్టుకుంటున్నా పాటించే వారే లేరు.

అందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలి



ప్లాస్టిక్ వాడకాన్ని నిలువరించడానికి ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పించాలి. ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో చేతి సంచులు తీసుకువెళ్లేలా ఇంట్లోని వారు ప్రోత్సహించాలి.

– ఎండీ ఖాజా, మున్సిపల్ వైస్ చైర్మన్, పెడన

దుకాణాలకు నోటీసులు ఇస్తున్నాం



120 మైక్రాన్‌ల కంటే అధికం అనే ముద్రణ ప్రతి సంచిపై కూడా ముద్రించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అటువంటి వాటినే విక్రయించాలి తప్ప తక్కువగా ఉన్న వాటిని విక్రయించకూడదు. ఈ విషయాన్ని అన్ని దుకాణాల వాళ్లకు చెప్పాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం ఆయా దుకాణదారులకు మొదటి సారిగా నోటీసులు ద్వారా హెచ్చరికలు ఇస్తున్నాం. అవగాహన సదస్సుల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తున్నాం.

– పి.హరికిషోర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, పెడన

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ఎంపీడీవో డి.సుబ్బారావు



ఘంటసాల వెలుగు కార్యాలయంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సుబ్బారావు

ఘంటసాల: మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి సమాజంలో ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. ఘంటసాలలోని వెలుగు కార్యాలయంలో వీఓఏలు, డ్వాక్రా గ్రూపు లీడర్లతో బుధవారం మండల మహిళా సమాఖ్య సమావేశం ఇన్‌చార్జి ఏపీఎం టి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ వెలుగు ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. డ్వాక్రా రుణాలు తీసుకున్న మహిళలు వ్యాపారాలు, ఇతర జీవనోపాధికి వినియోగించుకుని తమతో పాటు ఇతర సభ్యులను ఆర్థికంగా అభివృద్ధి చేసేలా చూడాలన్నారు. కుట్టు మిషన్ల పంపిణీ గురించి వివరించారు. శిక్షణ విషయాలు తెలియజేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా మహిళా రైతు ఉత్పత్తి సంఘాలకు సబ్సిడీపై అందించే వ్యవసాయ యంత్ర పరికరాలు, ఇతర రుణాల గూర్చి తెలియజేశారు. మే నెలలో సీసీఆర్సీ కార్డులు తీసుకున్న వారికి అన్నదాత సుఖీభవ ఇచ్చే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం అధికారి రాంబాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, పెరట్లో కూరగాయల పెంపకం, తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఆరోగ్యకరమైన పంటలు పండించడంపై అవగాహన కల్పించి తొలకరి జల్లులు పడే ముందు పొలాల్లో 32 రకాల విత్తనాలు చల్లడం ద్వారా భూమికి ఆరోగ్యం, గుల్లబారడం, నీటి నిల్వ సామర్థ్యం పెరిగే విధానం గురించి తెలిపారు. ఇన్‌చార్జి ఏపీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఘంటసాల మండలాన్ని మోడల్ మండలంగా తీసుకుని 2025-26లో మహిళలకు జీవనోపాధి కల్పించే అంశాలపై శిక్షణ ఇచ్చి రుణాలు మంజూరు చేసి పారిశ్రామిక వేత్తలుగా చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. మండలంలో 84 మహిళా రైతుల ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేశామని, ఆయా సంఘాల ద్వారా చిన్న, సూక్ష్మ వ్యాపారాలు చేయించడం, పిండి వంటలు, తేనె, చేనేత, వ్యవసాయం, ఇతర జీవనోపాధి మార్గాలు ఏర్పాటు చేసి వాటిని ఆన్‌లైన్ ద్వారా అమ్ముకునే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీసీలు ఎం.ఝాన్సీ, నాగేశ్వరమ్మ, నరసమ్మ, ఏవో జానకి, వీఓఏలు, డ్వాక్రా లీడర్లు, ఎల్1 నాగరాజు పాల్గొన్నారు.

మురుగు కాలువ ఆక్రమణ: పొక్లయిన్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పొక్లయిన్‌తో రెవెన్యూ అధికారులు

బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి గ్రామ పరిధిలో చేపల చెరువుల భూస్వామి ఒకరు మురుగు కాలువను ఆక్రమించి తవ్వకం చేస్తుండగా బుధవారం రెవెన్యూ అధికారులు కేసు నమోదు చేసి పొక్లయిన్ స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో పలువురు రైతులకు చెందిన పొలాలను గోదావరి జిల్లా ప్రాంతానికి చెందిన భూస్వామి లీజుకు తీసుకుని చేపల చెరువులుగా తవ్వారు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా చెరువు మరమ్మతులు చేస్తూ సమీపంలోని మురుగు బోదె పరిధిలో ఉన్న దాదాపు 14 సెంట్ల భూమిని ఆక్రమించి తవ్వకం చేస్తుండగా వీఆర్‌ఓ రామకృష్ణ అభ్యంతరం పెట్టారు. అయితే సదరు భూస్వామి కూటమి పార్టీల ఎంపీల పేర్లు చెప్పి బెదిరించే ప్రయత్నం చేశారు. వీఆర్‌ఓ ఇచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ కె. పూర్ణచంద్రరావు, ఆర్ఐ బి.శంకర్ కేసు నమోదు చేసి పొక్లయిన్ స్వాధీనం చేసుకున్నారు.

మోపిదేవి దేవస్థానానికి ఆర్వో వాటర్ ప్లాంట్ బహూకరణ



మోపిదేవి దేవస్థానంలో వాటర్ ప్లాంట్ బహూకరిస్తున్న దాత విక్రమాదిత్య, ఇతర కుటుంబసభ్యులు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంకు పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామ వాస్తవ్యులు తేళ్ల విక్రమాదిత్య, సహస్ర, శ్రీవిద్య, కోటేశ్వరరావు రూ.2 లక్షల విలువగల ఆర్వో వాటర్ ప్లాంట్‌ను బుధవారం బహూకరించారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన దాత కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిత్యాన్నప్రసాదశాలలో ఏర్పాటు చేసేందుకు ఈ ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అందజేసినట్లు తెలిపారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. రావి సురేష్, ఆలయ అధికారులు, మధుసూదనరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు బడ్జెట్లో రూ.2 వేల కోట్లు కేటాయించాలి

పెడన: చేనేతకు రాష్ట్ర బడ్జెట్లో రూ.2వేల కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం బుధవారం డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం కృష్ణాజిల్లా కమిటీ సమావేశం స్థానిక గుంటు నాగభూషణం ఇంటి వద్ద వాసా గంగాధరరావు అధ్యక్షత నిర్వహించారు. జిల్లా కార్యదర్శి గోరు రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలలో చేనేతకు నిధులు కేటాయిస్తామని, సహకార సంఘాలను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. చేనేత రంగానికి బడ్జెట్ అత్యంత దారుణంగా తగ్గించడాన్ని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గత ప్రభుత్వం అందించిన నేతన్న నేస్తం పథకాన్ని పునరుద్ధరించి అర్హులైన చేనేత కార్మికులందరికీ నేతన్న నేస్తం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పంచల రామ నరసింహారావు, పొన్న సత్యనారాయణ, గుంటు నాగభూషణం, ఊట్ల పేర్లలింగం, నందం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఇన్‌చార్జి ఏపీఎంగా శ్రీనివాసరావు



ఘంటసాల: ఘంటసాల మండలం వెలుగు ఇన్‌చార్జి ఏపీఎంగా టి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఘంటసాల ఏపీఎంగా పని చేసిన ఎం.పాండురంగ ప్రసాద్ గుడ్లవల్లేరు ఏపీఎంగా బదిలీ కాగా ఆయన స్థానంలో మొవ్వ ఏపీఎంగా పని చేస్తున్న శ్రీనివాసరావును ఇన్‌చార్జిగా అధికారులు నియమించారు. దీంతో బుధవారం శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. మండలాన్ని అన్ని రంగాల్లో రాణించేలా తన వంతు కృషి చేస్తానని శ్రీనివాసరావు తెలిపారు.

మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్షలపై అవగాహన



రావివారిపాలెం(మోపిదేవి): మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కేవీకే ఘంటసాల వ్యవసాయ కేంద్రం సమన్వయకర్త డాక్టర్ పి.సుధారాణి అన్నారు. మండలంలోని రావివారిపాలెంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, కేవీకే ఆధ్వర్యంలో గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం రావివారిపాలెంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ బ్రోమోడియోలిన్ విషపు ఎర తయారీ విధానం , పాటించాల్సిన మెలకువల పద్ధతి ప్రదర్శన ద్వారా రైతులకు వివరించారు. డాక్టర్ రేవతి, ఆదర్శ రైతులు జొన్నలగడ్డ పిచ్చేశ్వరరావు, పలువురు రైతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు బందరులో రామ్‌రాజ్ షోరూం ప్రారంభం

మచిలీపట్నంటౌన్: నగరంలోని గొడుగుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ షోరూంను గురువారం ఉదయం 9.30 గంటలకు మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ జ్యోతి ప్రజ్వలన చేస్తారని, పువ్వాడ రామ్‌ప్రసాద్ కుటుంబ సభ్యులు మొదటి కొనుగోలు చేస్తారని వారు తెలిపారు.

ఎంఎస్ఎంఈ పథకం కింద 94 యూనిట్లు మంజూరు

నాగాయలంక: మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్ఎంఈ)పథకం ద్వారా సాధారణ మందుల దుకాణాలు(జనరిక్ ఫార్మసీ) తదితర 106 రకాల వ్యాపారాలకు గాను మండలంలో 94 యూనిట్లు మంజూరు చేయనున్నట్లు స్థానిక ఎంపీడీఓ సుధాప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కులానికి వారి సంబంధిత కార్పొరేషన్ నుంచి 50 శాతం సబ్సిడి, 50 శాతం బ్యాంకు రుణంగా యూనిట్ లను అర్హులకు మంజూరు చేస్తారు. మండలంలోని నాగాయలంక ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భావదేవరపల్లి, గణపేశ్వరం లోని కెనరా బ్యాంకుల ద్వారా మండలంలో బీసీలకు 63, కాపులకు-21 యూనిట్లు, ఇతర కులాలకు 10 చొప్పున యూనిట్ కాస్టును అనుసరించి రుణాలు మంజూరు చేస్తారు. ఇతర వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలంటూ ఈ అవకాశాన్ని సంబంధిత లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

ప్రశాంతంగా పది హిందీ పరీక్ష

మోపిదేవి: పది పరీక్షలలో భాగంగా బుధవారం హిందీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో మోపిదేవిలో 161 మందికి గాను ముగ్గురు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి దుర్గాసాగర్ తెలిపారు. పెదకళ్లేపల్లి జెడ్పీ పాఠశాల కేంద్రంలో 72 మందికి గాను 72 మంది హాజరయ్యారని, మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల కేంద్రంలో 112 మందిలో ఒకరు గైర్హాజరు అయినట్లు ఎంఈవో వివరించారు.

సీనియర్ కమ్యూనిస్టు మాధవరావు మృతి

మొరకసపల్లి(మోపిదేవి): సీపీఎం సీనియర్ కార్యకర్త యర్రంశెట్టి మాధవరావు(96) బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రైవేటు వాటర్ ప్లాంట్‌లను తనిఖీలు చేస్తున్నారా?

ఎంపీపీ గరుడప్రసాద్



మినరల్ వాటర్ ప్లాంట్‌లపై ఏఈఈని ప్రశ్నిస్తున్న ఎంపీపీ గరుడప్రసాద్

కృత్తివెన్ను: ప్రజల తాగునీటి అవసరాలను ఆసరాగా తీసుకుని పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు వాటర్ ప్లాంట్‌లపై అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉంటోందని, మండలంలో ప్రైవేటు వాటర్ ప్లాంట్లను తనిఖీలు చేస్తున్నారా అని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగేశ్వరరావును ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. దీనిలో భాగంగా మినరల్ వాటర్‌ప్లాంట్‌లపై చర్చకు రాగా ఎంపీపీ పై విధంగా స్పందించారు. ప్రజారోగ్యం విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదన్నారు. రెండు గంటల పాటు ఏకధాటిగా విద్యుత్ కోత విధిస్తున్నారని దీని వల్ల ఆక్వా రైతులకు తీవ్ర నష్టం కలుగుతోందని జెడ్పీటీసీ సభ్యురాలు మైల రత్నకుమారి అన్నారు. దీనికి ఆ శాఖ ఏఈఈ సమాధానమిస్తూ నిరంతరాయంగా కాకుండా వెసులుబాటును బట్టి కోతలు ఉండేలా చూస్తామన్నారు. పంట కాలువల్లో చెత్తాచెదారం వేస్తూ కాలువ జలాలను కలుషితం చేయడంపై ఎంపీపీ, జెడ్పీటీసీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాలువ వెంబడి ఉన్న దుకాణాలు, నివాసాల యజమానులకు నోటీసులు ఇస్తామని ఏఈఈ రాజ్యలక్ష్మి తెలిపారు. అనంతరం ఎంపీపీ పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గూట్ల శిరీష, డీటీ శశికుమార్, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ఎంతో అవసరం



ఆర్టీసీ గ్యారేజీలోని కార్మికులకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మచిలీపట్నంటౌన్: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఎంతో అవసరమని ప్రభుత్వ జిల్లా సర్వజన ఆస్పత్రి టీబీ విభాగం సూపర్‌వైజర్లు అన్నారు. నగరంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపోలోని గ్యారేజీలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు వారు క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీబీ విభాగ సూపర్‌వైజర్లు మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రెండు వారాల పైబడి దగ్గు, జ్వరంతో పాటు దగ్గినప్పుడు కళ్లెలో రక్తపు చారలు కనపడటం, ఆకలి మందగించటం, బరువు తగ్గిపోవటం వంటి లక్షణాలు కన్పిస్తాయన్నారు. క్షయ వ్యాధి లక్షణాలలో ఏ ఒక్కటి ఉన్నా కళ్లె పరీక్ష చేయించుకోవాలన్నారు. నగరంలోని ప్రభుత్వ జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. క్షయ నిర్ధారణ అయిన తర్వాత ఆరు నెలల పాటు ఉచితంగా మందులు ఇస్తామన్నారు. చికిత్సా కాలంలో పోషకాహారం కోసం నెలకు వెయ్యి రూపాయల నగదును కేంద్ర ప్రభుత్వం బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తుందన్నారు. డి.ఎల్.ఏ.టి.ఓ డాక్టర్ ఎ.వెంకట్రావ్ సూచనల మేరకు మార్చి 24న ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా క్షయవ్యాధిపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీబీ విభాగ పీపీఎం ఎస్.మధుసూదనరావు, ఎస్‌టీఎస్ ఎ.విజయగౌరి, ఎస్‌టీఎల్‌ఎస్ ఎన్.రమేష్, టీబీహెచ్‌వీలు కేవీవీ ప్రసాద్‌బాబు, కేవీఎస్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన చిట్టి పిల్లారయ్య ఉత్సవం



హోమం నిర్వహిస్తున్న యాజ్ఞికులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని బుట్టాయిపేటలో ఉన్న శ్రీ వల్లభాంబ సమేత మహాగణపతి పంచాయతన క్షేత్రం (శ్రీ చిట్టిపిల్లారయ్యస్వామి దేవస్థానం) దశమ వార్షికోత్సవాలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ గణపతి పూజ, మహాన్యాస పారాయణ, ఏకాదశ రుద్రాభిషేకం, అగ్నిమంథన వంటి పూజా కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అగ్ని ప్రతిష్టాపన, శ్రీ శత చండీ యాగం, శ్రీ మహారుద్ర యాగంలను ప్రారంభించారు. అవహంతీ హోమాలు చేశారు. మధ్యాహ్నం పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం సంగీత గురువు అల్లాడ శ్యామలత ఆలపించిన భక్తి సంగీతం ఆకట్టుకుంది. తబలాపై దేవ కిషోర్, కీబోర్డుపై తేజ వాద్య సహకారం అందించారు.

సచివాలయ ఉద్యోగులకు కొత్త డివైస్‌లు



కొత్తగా వచ్చిన డివైస్‌లను పరిశీలిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

పెడన: పింఛన్ల పంపిణీ సమయంలో మొరాయిస్తున్న డివైస్‌లు, వేలి ముద్రలు సరిగ్గా తీసుకోని వాటిని మార్పు చేయాలని నిత్యం ఫిర్యాదులు వెళ్లడంతో అధికారులు వాటిని మార్చేందుకు చర్యలు చేపట్టారు. మచిలీపట్నం నుంచి బుధవారం పెడన ఎంపీడీవో కార్యాలయానికి 113 కొత్త డివైస్‌లు చేరాయి. వాటిని పనిచేస్తున్నదీ లేనిది పరిశీలించడంతో పాటు ఏ సచివాలయంలో ఎంత మందికి ఇవ్వాలనే దాని ప్రకారం జాబితాలను రూపొందించి అందిస్తామని జూనియర్ అసిస్టెంట్ కేశవ్ తెలిపారు.